ప్రజాశక్తి

ఆదివారం 12 మే 2024 | 8 పేజీలు



కర్నూలు



నంద్యాల



నంద్యాల ప్రజాగళం సభలో మాట్లాడుతున్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు

ప్రాజెక్టులు పూర్తి చేస్తాం..

- పరిశ్రమలు తెస్తాం.. - సండే ఎమ్మెల్యేను సాగనంపుదాం...

- టిడిపి అభ్యర్థులను గెలిపించండి - నంద్యాల ప్రజాగళం సభలో చంద్రబాబు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

టిడిపి అధికారంలోకి రాగానే ఉమ్మడి కర్నూలు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, పరిశ్రమలు తీసుకొస్తామని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. శనివారం నంద్యాలలోని రాజ్ థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజాగళం సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నంద్యాల జిల్లాలో టిడిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో అరాచక పాలన సాగిందని, సైకో పాలనకు చరమగీతం పాడాలని తెలిపారు. గోదావరి జలాలను పట్టిసీమ ద్వారా రాయలసీమకు మళ్లించి రాయలసీమను సస్యశ్యామలం చేయాలని ప్రయత్నిస్తే సైకో జగన్ నాశనం చేశారని, రాయలసీమ ద్రోహి జగన్ అని విమర్శించారు. నంద్యాల ఉప ఎన్నికల సందర్భంగా నంద్యాలలో రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపట్టమని తెలిపారు. భూమా బ్రహ్మానందరెడ్డిని ఆనాడు ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపించారని గుర్తు చేశారు. సామాజిక న్యాయంలో భాగంగా నంద్యాల సీటు ముస్లిం మైనార్టీలకు కేటాయించాల్సి వచ్చిందని, ఈ క్రమంలోనే

వార్త 3లో



ప్రచారంలో సిపిఎం అభ్యర్థి గౌస్‌దేశాయ్‌ని సన్మానిస్తున్న స్థానికులు. చిత్రంలో ఎం.ఎ.గఫూర్

బిజెపి, దాని మిత్రులను ఓడించండి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్

- కల్లూరు, ముజఫర్ నగర్ కాలనీలు ఎరుపుమయం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

బిజెపి దాని మిత్రులు టిడిపి, రహస్య మిత్రులు వైసిపి లను ఓడించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ పిలుపునిచ్చారు. కల్లూరు పాణ్యం నియోజకవర్గ పరిధిలోని 33వ వార్డు కల్లూరులో సిపిఎం అభ్యర్థి డి.గౌసే విజయాన్ని కాంక్షిస్తూ శనివారం భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్రచారం చివరి రోజు కావడంతో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్ , పాణ్యం సిపిఎం అభ్యర్థి డి.గౌస్ దేశాయ్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు నిర్మల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కల్లూరులో వందలాది మందితో సిపిఎం సీనియర్ నాయకులు రమణమూర్తి ,వెంకట రాముడు అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు స్వచ్ఛందంగా ఈ ర్యాలీలో పాల్గొని సిపిఎం అభ్యర్థికి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. కల్లూరులోని కాలనీలలో ప్రతి సందు, ప్రతి ఇల్లు ఎర్రజెండా మాయం అయిపోయింది. కల్లూరు, ముజఫర్ నగర్ లాంటి కాలనీలు సిపిఎంకి అంచుకోటగా ఉండే సెంటర్లు అలాంటి వార్డులు ఉండే ఈ స్థానం నుండి సిపిఎం అభ్యర్థి పోటీ చేయడం ప్రజల్లో నూతనోత్సాహం నిండింది. ఈ సందర్భంగా కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ కేంద్రంలో ఉండే బిజెపి దుర్మార్గాలను సపోర్ట్ చేస్తున్న టిడిపి వైసిపిలను ఓడించడం కోసం సిపిఎం అహర్నిశలు కృషి చేస్తుందని ప్రజలకు వివరించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత పెరిగే ధరలకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో చెత్త పన్ను డ్రైనేజీ పన్ను రకరకాల పన్నుల పేరుతో ప్రజలను

వార్త 3లో

రిసెప్షన్ సెంటర్ వద్ద

పటిష్టమైన ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన. చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్

- కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్ వద్ద ఇబ్బంది లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్‌డాక్టర్ జి.సృజన నోడల్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్లలో విధులు కేటాయించిన నోడల్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమెమాట్లాడుతూ సాధారణ ఎన్నికల రోజున రిసెప్షన్ సెంటర్ అనేది చాలా కీలకంగా ఉంటుందన్నారు. పోలింగ్ ముగించుకొని వచ్చే టీమ్స్, ఆర్‌ఒలు పోలింగ్ ముందు రోజు నుంచి పోలింగ్ కేంద్రాల్లో ఉంటూ విధులు పూర్తి చేసుకొని రావడం వల్ల వారు చాలా ఒత్తిడిలో ఉంటారన్నారు. రిసెప్షన్ సెంటర్‌లో ఉన్న నోడల్ ఆఫీసర్లు వచ్చే రిటర్నింగ్ అధికారులకు సపోర్ట్ చేస్తూ వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రిసెప్షన్ సెంటర్ కు వచ్చే పోలింగ్ సిబ్బందికి 13వ తేది సా.6.గం.ల నుంచి టీ, స్నాక్స్ రెడీ చేసుకోవడంతో పాటు భోజనం

వార్త 3లో

ముగిసిన ప్రచార పర్వం

- మూగబోయిన మైకులు

- జోరుగా ప్రలోభాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. దీంతో ఇప్పటి వరకూ హోరెత్తిన మైకులు బంద్ అయ్యాయి. ఇప్పటికే ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమాలను మొదలు పెట్టిన అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు మరింత జోరు పెంచారు..

మండుటెండల్లో రాష్ట్రాన్ని మరింత హీటెక్కించిన ఎన్నికల ప్రచార పర్వానికి శనివారం సాయంత్రంతో తెరపడింది. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం శనివారం సాయంత్రం 6 గంటలకు అన్ని రాజకీయ పార్టీల, స్వతంత్ర అభ్యర్థులు వారి ప్రచార పర్వాన్ని ముగించాల్సి ఉంది. దీంతో అభ్యర్థులు లౌడ్ స్పీకర్లు మూగబోయాయి. ప్రచారం ముగిసింది. ఇప్పటి వరకూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో అభ్యర్థుల ప్రచారం జోరుగా సాగింది. సకుటుంబ సపరివార సమేతంగా గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. పార్టీల ఫిరాయింపులతో పాటు ఎత్తులకు పైఎత్తులు వేశారు. ఆయా పార్టీల అధినేతల పర్యటనల వేగం పెరిగింది. గెలుపుకోసం వైసిపి, టిడిపి నేతలు అనేక తంటాలు పడుతున్నారు. జిల్లాలో చివరి రోజు నంద్యాలలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, ఆదోనిలో బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా పర్యటించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ముఖ్యమైన నాయకులు అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. టిడిపి అభ్యర్థుల తరపున టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు

వార్త 3లో



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి

అభ్యర్థులు, రాజకీయ నాయకులు

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి కె.శ్రీనివాసులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ నెల 13న జరిగే పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వంతు సహకారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ కె.శ్రీనివాసులు కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు చివరి 48 గంటల ప్రోటోకాల్‌పై జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుండి పోలింగ్ మెటీరియల్ పోలింగ్ కేంద్రాలకు చేరవేయడం, పోలింగ్ పిదప తిరిగి ఆర్జియం, శాంతిరామ్ ఇంజనీరింగ్ కాలేజీలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్ర పరిచేంత వరకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకొని సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేసామన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల వెలుపలే ఏజెంట్లు కౌంటర్లు ఏర్పాటు చేసుకోవాలే తప్ప ఎలాంటి జెండాలు, బ్యానర్లు,

వార్త 3లో

ఎన్నికల సామాగ్రి డిస్పాచింగ్ కేంద్రం ఏర్పాటు : రిటర్నింగ్ అధికారి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భారత ఎన్నికల సంఘం జారి చేసిన 2024 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ మేరకు ఈనెల 13న నిర్వహించబడే పోలింగ్ ప్రక్రియకు అవసరమైన పోలింగ్ మెటీరియల్ పంపిణీ కొరకు, నగరంలోని ఔట్ డోర్ స్టేడియం నందు డిస్పాచ్ కేంద్రం ఏర్పాటు చేశామని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ. భార్గవ్ తేజ తెలిపారు. 12 వ తేదీ ఆదివారం ఎన్నికల సామాగ్రిని పోలింగ్ సిబ్బందికి పంపిణీ చేసే క్రమంలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకూడదని, డిస్పాచ్ కేంద్రంలో విధులు నిర్వర్తించబోతున్న సిబ్బందిని ఎ. భార్గవ్ తేజ ఆదేశించారు. శనివారం కర్నూలు నగరపాలక కార్యాలయంలోని పాత కౌన్సిల్ హాల్ నందు డిస్పాచ్ కేంద్రం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి , పంపిణీ ప్రక్రియపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల సామాగ్రితో పోలింగ్ స్టేషన్లకు, పోలింగ్ సిబ్బంది రవాణా కోసం వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ వాహనాలను సెక్టార్ల వారీగా కేటాయించి ఎస్టీ బీసీ కళాశాల మైదానంలో సిద్ధంగా ఉంచామని రిటర్నింగ్ అధికారి ఎ. భార్గవ్ తేజ తెలిపారు. అనంతరం నగర శివారుల్లో ఉన్న రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్ నందు విధులు నిర్వర్తించబోయే సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి, వారికి రిసెప్షన్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. సమావేశంలో 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కర్నూలు అర్బన్ తహసీల్దార్ మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవ్ తేజ

అమ్మ రుణం తీర్చు కుందాం



అమ్మ అనే పదంలోనే ఉంది
ఎంతో అందం, అమ్మ తోనే జీవం
జననం మానవ జాతి నిర్మాణం
జీసస్ అయినా, మొహమ్మద్ అయినా, రాముడు అయినా,
కృష్ణుడు అయినా పుట్టింది
అమ్మ కడుపునే ఆడింది
అమ్మ వడినే, తిన్నది అమ్మ గోరు ముద్దనే, విన్నది అమ్మ లాలి పాటనే
పలికింది అమ్మ మాటనే
నేర్పింది అమ్మ బడి లోనే
మానవత్వం దైవత్వం అయినది
అమ్మ నేర్పిన పాఠం వల్లనే..
గాంధీజీ సత్యవాక్యం
శివాజీ సత్ప్రవర్తనం
ఈశ్వర చంద్రుని విద్యా వికాసం
అమ్మ పెంచి పోషించిన శీల సంపదే
సహనానికి, సహదయానికి
త్యాగానికి అను రాగానికి
భగవంతుని ప్రేమకు ప్రతి రూపం అమ్మ, తనకు మారుగా
మనకు తన ప్రేమను అందివ్వమని,
కంటికి రెప్పలా కాపాడమని
ఆ సర్వేశ్వరుడు దివి నుంచి
భువికి పంపిన ఆయన ప్రతి రూపమే అమ్మ
అందుకే చేద్దాం ఆమె కలలను సాకారం, అమ్మకు పాదాభివందనం
వృద్ధాప్యంలో ఆమెకు సేవచేసి
అమ్మ ప్రేమనుఅందించి, అమ్మ
రుణం తీర్చు కుందాం....

డాక్టర్ బివి. స్వరూప్ సిన్హా, కర్నూలు
(12-5-24.ఆదివారం-మాతృ దినోత్సవం)


కూల్ వాటర్ బాటిల్ అందజేస్తున్న ఎస్పి జి.కృష్ణకాంత్ , సిఐ గౌతమి

ట్రాఫిక్ పోలీసులకు శీతల పరికరాలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

వేసవిలో ఉపశమనం కల్గించేందుకు ట్రాఫిక్ పోలీసులకు శీతల పరికరాలను జిల్లా ఎస్పి జి.కృష్ణ కాంత్ అందజేశారు. ఈ సంధర్భంగా శనివారం కర్నూలు జిల్లా ఎస్పి క్యాంపు కార్యాలయంలో ట్రాఫిక్ విభాగపు పోలీసులకు చలువ అద్దాలు, కూల్ వాటర్ బాటిల్స్ , వైట్ హెల్మెట్‌లను జిల్లా ఎస్పి అందజేశారు. వేసవిలో రోడ్లపై గంటల తరబడి ఎండలో విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించామని, విధుల్లో ఆటంకం లేకుండా అనువుగా ఉండేందుకు చలువు అద్దాలు, కూల్ వాటర్ బాటిల్స్, వైట్ హెల్మెట్లను అందజేశామన్నారు. ట్రాఫిక్ పోలీసు సిబ్బంది సంక్షేమమే పరమావధిగా వేసవికాలంలో ఉపశమనం కల్గించేదిశగా, ట్రాఫిక్ సిబ్బంది ఇబ్బంది పడకూడదని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ విధులు నిర్వర్తించాలని కర్నూలు జిల్లా ఎస్పి జి.కృష్ణకాంత్ సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ గౌతమీ, ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన డిటిసి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి డిస్పాచ్ కేంద్రం , ఎన్నికల సామాగ్రితో పాటు ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో సిద్ధంగా ఉంచిన వాహనాలను డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీధర్ అధికారులతో కలిసి 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కర్నూలు నగరపాలక కమిషనర్ ఎ భార్గవ్ తేజ పరిశీలించారు.

బలహీన వర్గాల అభివృద్ధి వైసిపి ధ్యేయం: కంగాటి శ్రీదేవి


జొన్నగిరి రోడ్‌షోలో మాట్లాడుతున్న కంగాటి శ్రీదేవి

ప్రజాశక్తి-తుగ్గలి

బడుగు బలహీన వర్గాల అభివృద్ధి వైసిపి ధ్యేయమని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీదేవి అన్నారు. శనివారం సాయంత్రం జొన్నగిరిలో వైసిపి కార్యకర్తలు నిర్వహించిన రోడ్‌షోలో ఆమె ప్రసంగించారు. రోడ్ షో కార్యక్రమానికి భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చారు. రోడ్ షోలో ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు పేదల కు అందుతున్న సంక్షేమ పథకాలను నిసిగ్గుగా అడ్డుకున్నారన్నారు. పేదలపై ఆయన చేస్తున్న అరాచకం ఇంత అంత కాదని ఆమె అన్నారు. చంద్రబాబు అవ్వ తాతల ఉసురు పోసుకున్నారన్నారు. రైతులకు క్రమం తప్పకుండా ఇస్తున్న ఇప్పుడు సబ్సిడీ పథకాన్ని చంద్రబాబు నాయుడు అడ్డుకొని రైతు ద్రోహిగా మారారన్నారు. పేదరికం ప్రతిపాదికన ముస్లింలకు అందుతున్న 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తామన్న వారితో జత కట్టిన చంద్రబాబు ముస్లింల ద్రోహి అని అన్నారు. పేద చిన్నారులకు ఇంగ్లీష్ మీడియం చదువులు వద్దని కోర్టుకెక్కి అడ్డుకున్న పాపం చంద్రబాబుదని అన్నారు. ఇంతమందికి ద్రోహం చేసి రేపు అన్ని ఉచితంగా ఇస్తానంటున్నా ఆల్ ఫ్రీ బాబు అబద్దాలను నమ్మొద్దామా అని ఆమె ప్రశ్నించారు. ప్రజలు బాగా ఆలోచించి 13న ఎన్నికలలో రెండు ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని ఆమె కోరారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

వెల్దుర్తి : వెల్దుర్తి మండలంలో కేవలం ఐదేళ్ల పాలనలో అభివృద్ధి చేసి చూపించిన ఘనత తమకే దక్కుతుందని ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. ఎన్నికల ప్రచారం చివరి రోజున వెల్దుర్తి పట్టణంలో భారీ రోడ్‌షో నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీదేవికి మద్దతుగా రైతులు ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు. రోడ్ షో వెంట రైతులు ట్రాక్టర్ల పై వచ్చి ప్రదర్శన చేపట్టారు. ఎన్నో ఏళ్ళు వెల్దుర్తి పట్టణాన్ని వేధిస్తున్న తాగునీటి సమస్యను రూ.మూడున్నర కోట్లు వెచ్చించి పరిష్కరించడంతోపాటు రూ.12 కోట్ల వ్యయంతో రామళ్లకోట రహదారిని పూర్తిచేసి, రోడ్డు సౌకర్యం గ్రామాలకు కోట్లు ఖర్చు చేసి పూర్తి చేసామన్నారు. వెల్దుర్తి పట్టణంలో దాదాపుగా రూ.7 కోట్లతో 30 పడకల ఆసుపత్రిని నిర్మించామన్నారు. వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా తమ కుటుంబం ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే తనయుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా కంగాటి శ్రీదేవికి, ఎంపి అభ్యర్థి బివై రామయ్యకు ఇద్దరికి ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు.


వెల్దుర్తిలో మాట్లాడుతున్న కంగాటి శ్రీదేవి


ప్రమాదంలో మృతిచెందిన రమేష్

ఆర్‌టిసి కార్మికుని కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు 2 డిపోలో పనిచేస్తున్న రమేష్ (45) శ్రామిక్ (మెకానిక్) పని చేస్తున్న సమయంలో జాకీ ఫెయిల్ కావడం వలన బస్సు రమేష్‌పై పడటం వల్ల రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడని మతి చెందిన రమేష్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. ఆర్‌టిసి సంస్థ నాసిరకమైన పరికరాలు వాడడం ,మెయింటెనెన్స్ సరిగా లేకపోవడం పనిభారం పెరగడం వల్ల కార్మికులకు ప్రమాదాలు జరుగుతున్నాయనిఅన్నారు. కార్మికులకు కాంట్రాక్టర్ కనీస వేతనాలు కూడా చెల్లించడం లేదని విమర్శించారు. బస్సు రిపేర్‌కు సంబంధించి వాడే పరికరాలు నాసిరకం కావడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా మెకానిక్‌ల ప్రాణాలు రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కుటుంబానికి ఆదుకొనడానికి ప్రభుత్వం, ఆర్‌టిసి యాజమాన్యం , కాంట్రాక్టర్ ముందుకు రావాలని ఆ కుటుంబానికి తగిన పరిహారం చెల్లించాలన్నారు. లేనియెడల సిఐటియు నాయకత్వంలో ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. మరణించిన రమేష్ కుటుంబానికి సిఐటియు సానుభూతిని తెలిపారు.

వైసిపికి ఆర్‌యుఎఫ్, రాయలసీమ అభివృద్ధి వేదిక సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో జరుగుతున్న సాధారణ ఎన్నికల్లో శ్రీభాగ్ ఒప్పందంకు కట్టుబడి ఉన్నామని తన మేనిఫెస్టోలో వైసిపి పెట్టిన నేపథ్యంలో రాయలసీమ యునైటెడ్ ఫోర్స్, రాయలసీమ అభివృద్ధి వేదికలు తమ సంపూర్ణ మద్దతు వైసిపికి తెలుపుతున్నాయని ఆయా సంఘాల నాయకులు తెలిపారు. నగరంలోని బళ్లారి చౌరస్తాలో ఓ హోటల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌యుఎఫ్ నాయకులు నాగార్జునరెడ్డి, రాయలసీమ అభివృద్ధి వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవ రెడ్డి మాట్లాడుతూ గతంలో శ్రీభాగ్ ఒప్పందం గురించి ఎన్నో ఉద్యమాలు చేసి రాజధానిని వదులుకున్నామని అన్నారు. అదేవిధంగా రాయలసీమ ఎత్తిపోతల పథకంను నిర్మాణానికి అడుగడుగున ప్రతిపక్షాలు అడ్డుకోవడం చూస్తున్నామని అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాయలసీమ ఆత్మ గౌరవం కాపాడుతోంది వైసిపి అన్నారు. రాయలసీమ ప్రాంతం అభివృద్ధి కోసం న్యాయ రాజధానిని ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టడం అభినందనీయం అన్నారు. కావున ఈ ఎన్నికల్లో వైసిపికి తమ సంపూర్ణ మద్దతు తెలియచేస్తూ, వైసిపి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్‌యుఎఫ్,రాయలసీమ అభివృద్ధి వేదిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పాలక, ప్రతిపక్ష పార్టీలను ఇంటికి సాగనంపండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పాణ్యం నియోజకవర్గ ప్రజలు తమ ఓటుతో పాలక ప్రతి పక్షాలను ఇంటికి సాగనంపాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎండి షరీఫ్ ఓటర్లను అభ్యర్థించారు. శనివారం 36 వ వార్డు పాత కల్లూరు, చెంచునగర్, ఇందిరమ్మ కట్ట, ఎస్సీ కాలనీ, చౌడేశ్వరి దేవాలయం రోడ్ ప్రాంతాల్లో ఇంటింటికి కరపత్రాలు పంచారు. సిపిఎం అసెంబ్లీ అభ్యర్థి డి. గౌస్ దేశాయ్ సుత్తికొడవలి నక్షత్రం గుర్తు పై ఓట్లు వేసి, వేయించి శాసన సభకు పంపి ప్రజా సమస్యలను , జిల్లా సమస్యలను అసెంబ్లీలో తమ గళాన్ని వినిపించేందుకు తమ అమూల్యమైన ఓటు ఉపయోగపడుతుందని తెలిపారు.

ఈనెల 13 ఎన్నికల్లో తప్పక మీ ఓటును వేసి వేయించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చలపతి, శేషాద్రి ,గోపి, సాలు, గిడ్డయ్య, షఫ్రక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు పూర్తి చేస్తాం..

మొదటి పేజీ తరువాయి...

పార్టీని నమ్ముకొని ఉన్న మైనార్టీ నాయకుడు ఎన్ఎండీ ఫరూక్‌కు ఇచ్చామన్నారు. ఫరూక్‌ను గెలిపించాలని..భూమా బ్రహ్మానందరెడ్డి బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు. బ్రహ్మానందరెడ్డికి సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. అల్లు అర్జున్ ఇంటికి వస్తే జనసేన జెండాలు పెట్టుకొని స్థానిక ఎమ్మెల్యే నీతి బాహ్య చీకటి రాజకీయాలు చేస్తున్నారని శిల్పా రవిని ఉద్దేశించి అన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో పెద్ద సైకో ఉంటే నంద్యాలలో చిన్న సైకో ఉన్నాడన్నారు. సండే ఎమ్మెల్యేను శాశ్వతంగా సాగనంపుదామని చంద్రబాబు నాయుడు అన్నారు. జగనన్న భూ హక్కు చట్టం పేరుతో ప్రజల భూములు లాక్కోవాలని చూస్తున్నారన్నారు. వారసత్వ భూముల పత్రాలపైన జగన్ ఫొటో పెట్టుకోవడం ఏమిటని ప్రశ్నించారు. నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి మాట్లాడుతూ కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడేనన్నారు. నంద్యాలలో టిడిపి అధినేత చంద్రబాబును అరెస్టు చేశారని, అదే నంద్యాలలో అత్యధిక మెజార్టీతో టీడీపి అభ్యర్థులు ఎమ్మెల్యేగా ఫరూక్‌ను, ఎంపీగా తన్ను గెలిపించి చంద్రబాబుకు గిఫ్ట్ ఇవ్వాలన్నారు. నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నపుడే నంద్యాల అభివృద్ధి జరిగిందన్నారు. శిల్పా కుటుంబం దోచుకోవడం దాచుకోవడం తప్ప అభివృద్ధి చేయలేదన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, నాయకులు ఏవి సుబ్బారెడ్డి, ఏవీ ఆర్ ప్రసాద్, డాక్టర్ రవికృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన ప్రచార పర్వం

మొదటి పేజీ తరువాయి...

నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రచారం నిర్వహించారు. బిజెపి అభ్యర్థి తరపున కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా ప్రచారం చేపట్టారు. వైసిపి అభ్యర్థుల తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రచారం నిర్వహించారు.

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ప్రలోభాలను ప్రారంభించిన అధికార, ప్రతిపక్ష నాయకులు పంపకాల్లో జోరు పెంచారు. ఓటర్ల ఇంటి వద్దకు వచ్చి ఓటుకు కొన్ని ప్రాంతాల్లో రూ.వెయ్యి, మరికొన్ని ప్రాంతాల్లో రూ.2 వేలు ముట్టజెప్పారు. ఇంటింటా తిరుగుతూ ఓటర్లకు నగదు పంపిణీ చేపడుతున్నారు. తమ అభ్యర్థికే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. వార్డుల్లోని చోటా నాయకులకు ఈ బాధ్యతలను అప్పజెప్పారు.

బిజెపి, దాని మిత్రులను ఓడించండి

మొదటి పేజీ తరువాయి...

ముక్కుపిండి వసూలు చేయడమే తప్ప ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలనే తపనగాని, పెరిగేధరలను నియంత్రించే తపనలేని ముఖ్యమంత్రిని ఇంటికి సాగనంపడమే సిపిఎం ప్రథమ లక్ష్యమని అన్నారు. ఈ దేశంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవు, కొత్త పరిశ్రమలు లేవు, ఉన్న పరిశ్రమలను మూసి వేయడం తప్ప కొత్త పరిశ్రమలు నిర్మించాలని ఆలోచన లేని నరేంద్ర మోడీని ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పే రోజు వచ్చిందని బిజెపికి అంటకాగే తెలుగుదేశం, వైసిపిలకు బుద్ధి చెప్పే ఆవశ్యకత వచ్చిందన్నారు. ఓటు అనే ఆయుధంతో ఇంటికి సాగనంపాలని కోరారు. పాణ్యం నియోజకవర్గ పరిధిలోని కల్లూరు కాలనీలలో అభివృద్ధి శూన్యమని గతంలో తాను ఎమ్మెల్యే ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి తప్ప ఇసుమంతైనా అభివద్ధి చేయని వైసీపీ ఎమ్మెల్యేకి ఓట్లు అడిగే అర్హత లేదని విమర్శించారు. అందుకే సిపిఎం పార్టీ అభ్యర్థి డి గౌస్ దేశాయ్ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై మీ అమూల్యమైన ఓట్లు వేసి వేయించి అఖండమైన మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎంనగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, జిల్లా నాయకులు ఎండి ఆనంద్ బాబు, రామకృష్ణ, శ్రీనివాసులు సుధాకరప్ప, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పటిష్టమైన ఏర్పాట్లు

మొదటి పేజీ తరువాయి...

కూడా రా.7.గం.ల నుండి దఫాలుగా వందుతూ వచ్చే పోలింగ్ సిబ్బందికి రాత్రి వరకు సరిపడా భోజనం ఏర్పాటు చేసుకోవడంతో పాటు రాత్రంతా టీ, స్నాక్స్ అందుబాటులో ఉండేలా టీమ్స్ వేసుకుని చూడాలని డ్వామా పిడి, డిఎస్ఓ ను కలెక్టర్ అదేశించారు. రిసెప్షన్ సెంటర్ లో సరిపడా కుర్చీలు, టేబుల్స్, బ్యారికేడింగ్, తాగు నీరు ఏర్పాట్లను ఉన్నాయా లేదా అని చెక్ చేసుకోవాలని టిడ్కో, ఆర్ అండ్ బిఎస్ఇ పర్యవేక్షించాలన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత వచ్చే ఇవిఎంలను నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్ రూమ్లకు చేర్చేందుకు అవసరమైన హమాలీలను 13వ తేది సా.6.గం.ల నుండి అందుబాటు లో ఉంచుకోవాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి 50 మందికి హమాలీలను ఇచ్చామన్నారు. వారికి ప్రత్యేక టీ షర్ట్స్ అందజేయాలని, అవసరాన్ని బట్టి ఇంకొంత మందిని గుర్తించి ఇంకొక బ్యాచ్‌గా తయారు చేసి ముందు బ్యాచ్ కు ప్రత్యామ్నాయంగా ఉండేలా చూడాలని సివిల్ సప్లయిస్ డిఎం, కార్మిక శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. శానిటేషన్ కు సంబంధించి రిసెప్షన్ సెంటర్ వద్ద ఎటువంటి చెత్త చెదారం ఉండకుండా నైట్ శానిటేషన్ వర్కర్స్ కూడా ఏర్పాటు చేయాలని అదనపు మున్సిపల్ కమీషనర్, ఆర్ అండ్‌బిఎస్ఇ ని ఆదేశించారు. ఇంజనీరింగ్ బ్లాక్‌కు హౌసింగ్ పిడి, లైఫ్ సైన్సెస్ బ్లాక్స్ కు మైనార్టీ అధికారి, లైబ్రరీ బ్లాక్ కు మెప్మా పిడి ని స్ట్రాంగ్ రూమ్ ఇంఛార్జిలుగా ఉంటూ వచ్చే ఇవిఎంలు అన్ని సరైన ప్రదేశంలో ఉంచారా లేదా ? సరైన డాక్యుమెంటేషన్ ఉన్నాయా లేదా ? సీల్ వేయాల్సిన చోట వేశారా లేదా అని పరిశీలిస్తూ ఆర్ఓలకు అవసరమైన సహాయ సహకారాలు అందజేయాలన్నారు. విద్యుత్ అంతరాయం ఉండకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన డేటాను ఇచ్చిన ఫార్మాట్‌లో పూర్తి చేయడంతో పాటు, ఏర్పాటు చేసిన యూనిక్ పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసి సదరు డాక్యుమెంట్స్ స్క్రూటినీ చేయడంతో పాటు అన్ని నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాల స్క్రూటినీ పేపర్లను భద్రపరుచుకొని మరుసటి రోజు ఆర్ఓలకు, అబ్జర్వర్లకు అందజేసేలా టీమ్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఎంప్లాయిమెంట్ అధికారి, ఏపీఐఐసీ జెడ్ఎం, పరిశ్రమల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కంట్రోల్ రూంలో ఎప్పటికప్పుడు లైవ్ ఫీడ్ ఉండడంతో పాటు ఒక టెక్నీషియన్ కూడా అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారిని కలెక్టర్ ఆదేశించారు. రిసెప్షన్ సెంటర్ వద్ద మ్యాప్స్, పెద్ద సైన్ బోర్డ్స్ రేపటి కల్లా ఏర్పాటు చేయాలన్నారు. రిసెప్షన్ సెంటర్ కు వచ్చే బస్సులు మధ్యలో ఆగకుండా నేరుగా పార్కింగ్ దగ్గర వాహనాలు నిలిచేలా చూడడంతో పాటు వర్షం కారణంగా వాహనాలు బురదలో దిగబడి పోకుండా రాళ్లు వేయించాలని ఆర్ అండ్‌బి ఎస్ఇ, అదనపు ఎస్పీని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పి జి.కష్ణకాంత్ మాట్లాడుతూ ఎక్కడైతే మైక్రో అబ్జర్వర్, ప్రిసైడింగ్ ఆఫీసర్స్ ఉంటారో అక్కడ పాటించాల్సిన నియమ నిబంధనలను పోలీసు అధికారులకు తెలియజేస్తే అందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రిసెప్షన్ సెంటర్ వద్ద సరిపడా విద్యుత్ ఉండేలా చూడాలన్నారు. వివిధ నియోజకవర్గాల నుంచి బస్సులు వస్తాయి కాబట్టి ఒకవేళ వర్షం పడి బురదలో బస్సు ఇరుకున్న తీసేందుకు జెసిబిని కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అదనపు ఎస్పీ నాగరాజు, ఆర్ అండ్ బీ ఎస్ఇ నాగరాజు, సిపిఓ హిమ ప్రభాకర రాజు, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, డిపిఒ నాగరాజు నాయుడు, సివిల్ సప్లై డిఎం షర్మిల, డిఎస్ఒ మూర్తి, హౌసింగ్ పీడీ సిద్దలింగమూర్తి, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, డిటిసి శ్రీధర్, ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి, ఎపిఐఐసి జెడ్ఎం సోమశేఖర్ రెడ్డి, మెప్మా పిడి నాగ శివలీల, మైనారిటీ సంక్షేమ అధికారి సునీల్ ఖన్నా, టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, ఆర్టీసీ అధికారి శ్రీనివాసులు, డీఈఓ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 144 సెక్షన్ అమలు : పోలింగ్ ముగింపునకు 48 గంటలు ముందు నిశ్శబ్ద సమయం పాటించాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి సృజన శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ విధించామని, ఈ సెక్షన్ మే 11 వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి 14 వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు అమలులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఎక్కడా 5 మంది వ్యక్తులకు మించి ఒకే చోట గుమికూడరాదని కలెక్టర్ స్పష్టం చేశారు.

'ఓటింగ్ శాతం పెంపునకు కృషి'

ప్రజాశక్తి - ఆదోని

ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకుని ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రా రెడ్డి కోరారు. స్వీప్ యాక్టివిటీలో భాగంగా శనివారం ఆదోనిలోని శ్రీనివాస్ భవన్ నుంచి వన్‌టౌన్, షరాఫ్ బజార్, రోషన్ లాడ్జీ, భీమా సర్కిల్ వరకు ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటరు చైతన్యమే ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. అధికారులు కూడా ఓటు హక్కు వినియోగంపై చైతన్యం తీసుకురావాలన్నారు. రానున్న ఎన్నికల్లో అందరూ కచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. వృద్ధులు ఇంటి నుంచి ఓటు వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. విద్యార్థులు ఇళ్లకు వెళ్లగానే తల్లిదండ్రులకు ఓటు విలువను తెలియజేయాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటును వేయాలని తెలిపారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

మొదటి పేజీ తరువాయి...

ప్రచారానికి సంబంధించి ఐటమ్స్ ఏవి ఉండరాదని స్పష్టం చేశారు. పోటీ చేసే అభ్యర్థులకు ఒక వాహనం, ఎలక్షన్ ఏజెంట్లకు ఒక వాహనం, అసెంబ్లీ సెగ్మెంట్లకు ఒక వాహనం చొప్పున మూడు వాహనాలనే అనుమతిస్తామన్నారు. జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు పెద్దఎత్తున పోలీస్ సిబ్బందిని నియమించామన్నారు.

నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి : పోలింగ్‌కు ముందు 48 గంటల నుండి ఎన్నికలు ముగిసే వరకు కీలకమైన సమయమని, పోలింగ్ ఏర్పాట్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు ఆదేశించారు. నందికొట్కూరు, ఆత్మకూరు నియోజకవర్గాలలో మోడల్ పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని స్వీప్ నోడల్ అధికారిని ఆదేశించారు.

48 గంటల ముందు నిశ్శబ్ద సమయం పాటించాలి : పోలింగ్ ముగింపునకు 48 గంటలు ముందు నిశ్శబ్ద సమయం పాటించాలని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. పోలింగ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ విధించినట్లు పేర్కొన్నారు.

వైసిపి జెండా ఎగరడం ఖాయం

- వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి

ప్రజాశక్తి - ఆస్పరి

ఆలూరు నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగురవేయడం ఖాయమని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని జోహారపురం గ్రామంలో ఇంటింటికీ తిరిగి వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మాటలు నమ్మవద్దని, ప్రజలను మోసగించడమే చంద్రబాబు నైజమని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించామని చెప్పారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల ముందుకొచ్చి ఓట్లు అడిగే టిడిపి నాయకులు కావాలో, కష్టాల్లో తోడుగా నిలిచే జగన్ కావాలో నిర్ణయించుకోవాలని తెలిపారు. ఆలూరు చాలా వెనుకబడిన నియోజకవర్గమని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే వేదవతి, నగరడోన రిజర్వాయర్లు పూర్తి చేసి ఆలూరు తాలూకాకు తాగు, సాగునీరు అందించి సస్యశ్యామలం చేస్తామని హామీఇచ్చారు. ఈనెల 13న జరిగే పోలింగ్‌లో వైసిపి ఎంపీ అభ్యర్థి బివై.రామయ్యకు, ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షికి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. జడ్‌పిటిసి దొరబాబు, కెడిసిసి జిల్లా బ్యాంకు డైరెక్టర్ రాఘవేంద్ర, వైసిపి తాలూకా నాయకులు వైకుంఠం మల్లికార్జున, మసాలా పద్మజ, ఎంపిటిసి శ్రీరాములు, సర్పంచి నెల్లూరప్ప, నాయకులు దత్తాత్రేయ రెడ్డి, నరసింహులు, సంజీవ్ రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న విరుపాక్షి

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ యాదవ్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ యాదవ్ తెలిపారు. శనివారం పట్టణంలోని బొబ్బులమ్మ గుడి వీధి, కాజీపుర, బాలాజీ పేట, వడ్డేగేరి ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలో రోజురోజుకు జనాభా పెరుగుతోందని, జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటిని సమకూర్చడంలో పాలకులు వైఫల్యం చెందారని విమర్శించారు. తాను అధికారంలోకి రాగానే మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం చేపట్టి శివారు ప్రాంతాలకు కూడా తాగునీటి సమస్య రాకుండా చూస్తామన్నారు. దేశంలో కచ్చితంగా ఇండియా వేదిక పార్టీలు అధికారంలోకి రావడం తథ్యమన్నారు. అందరి సమ్మతం మేరకు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ ఇన్‌ఛార్జి దేవిశెట్టి ప్రకాష్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. నాయకులు అజయ్ బాబు, ఈరన్న, కల్లుబావి రాజు, సుదర్శన్, హుస్సేనప్ప యాదవ్, నరసింహ ఉన్నారు.


కేక్ కట్ చేస్తున్న నాయకులు

బీసీ మహిళను ఆశీర్వదించండి

- వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బీసీ మహిళగా తనను ఆశీర్వదించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక కోరారు. శనివారం పట్టణంలోని శివన్న నగర్ నుంచి అబ్బా టాకీస్, ఎన్‌టిఆర్ కాలనీ బోర్డు, సోగనూరు రోడ్డు, బిఎన్ రైస్ మిల్, కోట స్ట్రీట్, మల్లారి వీధి, తేరు బజారు, లక్ష్మీ పేట, కల్లుపెంట, సంజీవ్ నగర్, మాల కొండయ్య హాస్పిటల్, బడేసా దర్గా, మాలగేరి, తిలక్ నగర్, కమిటీ రోడ్డు, కమిటీ సర్కిల్, ఎమ్మెస్ నగర్, ఎల్లమ్మ బీడు మీదుగా రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బీసీ మహిళ చేనేత ఆడబిడ్డనని, తనకు ఎమ్మెల్యేగా అవకాశం వచ్చిందని తెలిపారు. ఈనె 13న జరిగే పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక వార్డులోని సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తానని చెప్పారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవ చేసుకుంటానని తెలిపారు. మాచాని సోమప్ప ఎమ్మిగనూరును ఏ విధంగా అభివృద్ధి చేశారో అలాగే తాను కూడా మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. చేనేతలకు టెక్స్‌టైల్ పార్కు తీసుకొస్తానని, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేలా కృషి చేస్తానని హామీఇచ్చారు. రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఛైర్మన్ వై.రుద్ర గౌడ్ పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న బుట్టా రేణుక

ప్రతి ఒక్కరూ నా కుటుంబ సభ్యులే

- వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గంలోని ప్రతి సామాజిక వర్గమూ తన కుటుంబ సభ్యులేనని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.బాలనాగిరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని చెట్నిహల్లి, మంచాల గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల వాల్మీకి వర్గం అంటూ ఒక నాయకుడు వచ్చాడని తెలిపారు. ఇన్ని రోజులు వైసిపిలో ఉండి పదవులు అనుభవించి సంపాదించి నేడు పార్టీ మార్చి స్వార్థం కోసం కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వైసిపి పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. మిగిలిన అభివృద్ధి మళ్లీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ద్వారా పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో వైసిపి ఎంపీ అభ్యర్థి బివై.రామయ్యకు, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే కూతురు ప్రియాంక రెడ్డి, కోడలు కుమారి రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు భీమిరెడ్డి, సర్పంచి భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, వైస్ ఎంపిపి రాఘవేంద్ర, ఎంపిటిసి వెంకటేష్, నాయకులు జనార్ధన్ రెడ్డి, పెట్రోలు బంకు శ్రీనివాస్, బొంబాయి శివ, గోర్కల్ కృష్ణస్వామి, కురువ మల్లికార్జున పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాలనాగిరెడ్డి



కాంగ్రెస్ అభ్యర్థి ఆర్థర్‌ను గెలిపించాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఉపాధి హామీ చట్టాన్ని తెచ్చిన కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓట్లు వేసి ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు ప్రజలను కోరారు. శనివారం మండలంలోని కొణిదెల గ్రామంలో నందికొట్కూరు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్థర్ హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సిపిఎం నాయకులు కె భాస్కర్ రెడ్డి, కే మద్దిలేటి, కె వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలను ఉద్దేశించి ఎం.నాగేశ్వరావు మాట్లాడుతూ 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజార్టీ లేకపోవడం వల్ల కమ్యూనిస్టులు మద్దతుతో అధికారంలోకి వచ్చి నాడు 2005లో ఉపాధి హామీ చట్టాన్ని పార్లమెంటులో చేశారన్నారు. నేడు ఉపాధి హామీ చట్టం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాదిమంది కష్టజీవులు వలసలు వెళ్లకుండా పనులను కల్పిస్తున్నట్లు తెలిపారు. నేటి బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్లో రూ.98 వేల కోట్ల నుండి రూ.60 వేల కోట్లకు తగ్గించిందని, ఉపాధి పనుల దగ్గర సౌకర్యాలు కల్పించకపోవడం, గడ్డపార, మంచి నీటికి, గంపకు ఇచ్చే డబ్బులను కట్ చేయడం, వేసవికాలంలో ఇచ్చే సమ్మర్ అలవెన్స్ రద్దు చేసిందన్నారు. నరేంద్ర మోడీ విధానాలకు రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు సపోర్ట్ చేస్తున్నాయన్నారు. కావున ఎన్నికల్లో వైసిపి, టిడిపి, బిజెపిలను ఓడించి, నీతి నిజాయితీగా పనిచేస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్థర్‌కు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

మైనార్టీలను జగన్ కాపాడగలరా..?

- రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

- నంద్యాల ఎంపీ అభ్యర్థి లక్ష్మి నరసింహ యాదవ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

'మైనారిటీలను వైఎస్ జగన్మోహన్ రెడ్డి కాపాడగలరా..? మైనార్టీలకు రక్షణ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సాధ్యం' అని నంద్యాల పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి జె.లక్ష్మీ నరసింహ యాదవ్ అన్నారు. శనివారం బెన్నీ కాంప్లెక్స్, పోలీస్ క్వార్టర్స్, చాబోలు క్రాస్ రోడ్, అశోక్ నగర్, రైతునగరం పరిసర ప్రాంతాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో నంద్యాల పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల అభ్యర్థులను గెలిపించే బాధ్యత పార్లమెంట్ ప్రజలదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 9 గ్యారెంటీలను అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో జె.లక్ష్మీ నరసింహ యాదవ్

వైసిపి గెలుపే ధ్యేయం : కాటసాని, చల్లా కుటుంబాలు

ప్రజాశక్తి - అవుకు

బనగానపల్లె నియోజకవర్గంలో వైసిపి గెలుపే లక్ష్యంగా కాటసాని, చల్లా కుటుంబాలు పని చేస్తాయని వైసిపి ముఖ్య నాయకులు చల్లా విఘ్నేశ్వర రెడ్డి అన్నారు. శనివారం అవుకు పట్టణంలోని చల్లా భవన్‌కు బనగానపల్లె వైసిపి అభ్యర్థి కాటసాని రామిరెడ్డి సతీమణి జయమ్మతో కలిసి చేరుకొని చల్లా కుటుంబ సభ్యులను కలిశారు. వైసీపీ సీనియర్ నాయకులు చల్లా సూర్య ప్రకాష్ రెడ్డి, మండల అధ్యక్షుడు చల్లా రాజశేఖర్ రెడ్డి, యువ నాయకుడు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, ఉప సర్పంచి చల్లా రఘునాథరెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ముడియం జయచంద్ర రెడ్డిలను కలిశారు. ఈ సందర్భంగా ఇరు కుటుంబాల నాయకులు మాట్లాడుతూ చల్లా, కాటసాని కుటుంబాలు అన్నదమ్ముల్లా కలిసి వైసీపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నామని, వైసిపి జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రెండవసారిగా జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. చల్లా, కాటసాని కుటుంబాలు వేరు కాదని, ఒక్కటేనని అన్నారు. అక్కడక్కడ చిన్న మనస్పర్ధలు వచ్చినా సర్దుకుని పార్టీ గెలుపు కోసం పని చేస్తున్నామని తెలిపారు.


చల్లా కుటుంబ సభ్యులను కలిసిన బనగానపల్లె వైసిపి అభ్యర్థి కాటసాని రామిరెడ్డి, కాటసాని జయమ్మ

నియోజకవర్గ అభివృద్ధి కోసం బిసిని గెలిపించండి

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె నియోజకవర్గం అభివృద్ధి కోసం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్ధన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టిడిపి నాయకులు బిసి రామనాథరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శనివారం కోయిలకుంట్ల పట్టణంలోని సంతపేటలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్ధన్ రెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి బైరెడ్డి శబరిల సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, సంక్షేమం, అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించాలన్నారు. టిడిపి పాలనలో జరిగిన అభివృద్ధి తప్ప గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని తెలిపారు. రైతుల సంక్షేమం, యువత ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న బిసి రామనాథరెడ్డి

టిడిపికి ఓటు వేసి ఆదరించండి : బుడ్డా

ప్రజాశక్తి - ఆత్మకూర్

శ్రీశైలం నియోజకవర్గంలో ఓటర్లు తెలుగుదేశం పార్టీ గుర్తు సైకిల్‌పై ఓటు వేసి గెలిపించాలని శ్రీశైలం టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా సాగు, తాగు నీరు ప్రధాన సమస్యగా ఉందన్నారు. టిడిపి విజయం సాధించిన వెంటనే ఈ సమస్యలతో పాటు గ్రామాలలో స్మశాన వాటిక సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు . సిద్దాపురం లిఫ్ట్ ఇరిగేషన్ నుండి ప్రత్యేకంగా తుము ఏర్పాటు చేసి ఐదారు గ్రామాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. వరదరాజ స్వామి ప్రాజెక్టుకు శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలలో ఇప్పటికే టిడిపి పట్ల ప్రజలు ఆదరణ చూపుతున్నారని, ఈ ఎన్నికల్లో విజయం సాధించడం తథ్యమన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వల్ల రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అనంతరం ఆ పత్రాలను టిడిపి కార్యకర్తలతో కలిసి కలిసి దగ్ధం చేసి నిరసన తెలిపారు.


ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పత్రాలను దగ్ధం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, నాయకులు

కబ్జాలు కాకుండా భూ హక్కు చట్టం : గంగుల

ప్రజాశక్తి - చాగలమర్రి

భూకబ్జాలు, బలవంతపు రిజిస్ట్రేషన్లు జరగకుండా ఉండేందుకు కేంద్రంలో ఉండే బిజెపి ప్రభుత్వం భూ హక్కు చట్టం ప్రవేశపెట్టిందని ఆళ్లగడ్డ వైసిపి అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మద్దూరు గ్రామంలో ఎన్నికల రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల క్రితం భూ హక్కు చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, తెలియకుండా ప్రజలకు వివరించి చెప్తే వినే వారు ఎవరూ లేరన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్ర పర్యటనలో భాగంగా భూహక్కు చట్టం గురించి సభలో మాట్లాడితే చంద్రబాబు నాయుడు ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. ఈ భూ హక్కు చట్టం గురించి టిడిపి నాయకులు అర్థరహితంగా మాట్లాడుతున్నారన్నారు. వారి ప్రలోభాలకు లొంగకుండా నీతి నిజాయితీ నిబద్ధతగల ఉండే నాయకుడిని ఎన్నుకుంటే అభివృద్ధి మరింత జరుగుతుందన్నారు. మా కుటుంబం పాలనలో ఉన్నప్పుడు, తాను అభివద్ధి చేశాను కాబట్టే ఓట్లు అడిగేందుకు మీ ముందుకు వచ్చానన్నారు. ప్రచారంలో ఎంపీపీ వీరభద్రుడు, సింగిల్ విండో అధ్యక్షులు దస్తగిరి, వైసిపి రాష్ట్ర సేవల ప్రధాన కార్యదర్శి చుండూరు వెంకటరమణ, సాల్మను షరీఫ్, ఎంపీటీసీ బేబమ్మ ,జమాల్, బ్రాహ్మణపల్లి శ్రీనివాస్ రెడ్డి, కందుల వెంకట్రాంరెడ్డి, లక్ష్మీనారాయణ చిన్న దస్తగిరి, శివ, పెద్ద రాముడు, మనోహర్ రెడ్డి, రమణారెడ్డి వెలుగోటి వెంకటరామిరెడ్డి ముడియం చిన్ననాయుడు, ఏసన్న, వలిసా గారి రఫీ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


మద్దూరు గ్రామంలో రోడ్ షోలో ప్రసంగిస్తున్న గంగుల బిజేంద్రారెడ్డి

నియోజకవర్గాన్ని అభివద్ధి చేస్తా

- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తా
- సూపర్ సిక్స్ పథకాల అమలే ప్రధాన ఎజెండా
- సమన్వయంతో ముందుకు సాగుతున్నాం
- కోడుమూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి



ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజలు తనను ఆదరించి ఈ ఎన్నికల్లో గెలిపిస్తే కోడుమూరు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి చూపుతానని కోడుమూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఎన్నికల ప్రచారం విశేషాలను ఆయన పంచుకున్నారు.

నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది ?. ప్రజల నుంచి ఎలాంటి స్పందన లభిస్తుంది ?.

దస్తగిరి: కోడుమూరు నియోజకవర్గంలో పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గ టిడిపి సీనియర్ నేత డి.విష్ణువర్ధన్‌రెడ్డి నాయకత్వంలో సమన్వయంతో ఎన్నికల ప్రచారాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహిస్తున్నాం. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు మాకు బ్రహ్మరథం పడుతున్నారు. ప్రభుత్వ అలివి మారిన ధారాలతో ప్రజలు విసిగివేసారి పోయామని ప్రభుత్వం పట్ల వారికున్న వ్యతిరేకతను వెలిబుచ్చుతున్నారు. రాష్ట్రానికి టిడిపి ప్రభుత్వమే ప్రత్యామ్నాయం అని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

పార్టీలో గ్రూప్ తగాదాలు ఉన్నట్లు వసమాచారం? గెలుపుపై ఏమైనా ప్రభావం చూపనుందా?

దస్తగిరి: పార్టీలో గ్రూపు తగాదాల సమస్య లేదు. గతంలో కొన్ని ఇబ్బందులు ఉండేవి. ప్రస్తుతం వాటి ప్రస్తావనే లేదు. అదంతా కేవలం గిట్టని వారి ప్రచారం మాత్రమే. విష్ణు కోట్ల వర్గీయులు సన్నిహితంగా సమన్వయంతో ప్రచారంలో గెలుపే లక్ష్యంగా వ్యూహరచనతో ముందుకు సాగుతున్నాం. ఈ ఎన్నికల్లో ముమ్మాటికీ గెలుపు మాదే.

మీ గెలుపునకు మీకున్న సానుకూల అంశాలు ఏమిటి?

దస్తగిరి : నియోజకవర్గంలో మాకు అన్ని విధాల సానుకూల అంశాలు ఉన్నాయి. ప్రధానంగా ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత మాకు కలిసొచ్చే అంశం. సూపర్ సిక్స్ పథకాలు ప్రజలను విపరీతంగా కట్టుకుంటున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మేనిఫెస్టోలో కొత్త విషయాలు ఏమీ లేవు. పాత సీసాలో కొత్త సారా అన్న చందంగా పరిస్థితి ఉంది. నియోజక వర్గంలో విష్ణువర్ధన్ రెడ్డి చేసిన సేవా కార్యక్రమాలు నాగెలుపునకు పునాది కానున్నాయి.

ఈ ఎన్నికలు మీరు గెలిస్తే నియోజకవర్గ అభివృద్ధికి మీ వద్ద ఉన్న ప్రణాళిక ఏమిటి?

దస్తగిరి: ఎన్నికల ప్రచారంలో ప్రతి గ్రామాన్ని ప్రత్యక్షంగా సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నాను. వారి వద్ద నుండి అనేక సమస్యలు నా దృష్టికి వచ్చాయి. ప్రజలకు గత ప్రభుత్వం తీరం ద్రోహం చేసింది. అభివృద్ధిని గాలికి వదిలేసింది. అనేక గ్రామాలకు కనీసం తాగడానికి మంచి నీళ్ల కూడా సమగ్రంగా అందని దుస్థితి. గ్రామాలకు వేసిన రోడ్లు శిథిలావస్థలకు చేరాయి. నియోజకవర్గంలో తాగు సాగునీటి ప్రాజెక్టులు శిలాఫలకాలు దిష్టి బొమ్మలలా మారాయి. సాగునీరు లేక లక్షలాది ఎకరాలు నోరెళ్లబెట్టాయి. కరువుతో రైతులు వలస బాట పడుతున్నారు. ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించి అమలు చేయకుండా మోసం చేసింది. ఈ సమస్యలన్నీటిని ప్రధాన ఎజెండాగా తీసుకొని విష్ణువర్ధన్ రెడ్డి నాయకత్వంలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాను. ఈ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలని కోరుతున్నాను.

అవినీతి పాలకు ఓటుతో బుద్ధి చెప్పాలి

- ఆళ్లగడ్డ టిడిపి అభ్యర్థి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - చాగలమర్రి

గత ఐదేళ్లుగా రాష్ట్రంలో కొనసాగుతున్న వైసిపి అరాచక, అవినీతి, అక్రమాల పాలనకు రాష్ట్ర ప్రజలు ఓటుతో సమాధానం చెప్పాలని ఆళ్లగడ్డ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియ కోరారు. శనివారం చాగలమర్రి పట్టణంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, జనసేన నాయకులు ఇరిగేలా రాంపుల్లారెడ్డి, టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి లతోకలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటమి భయంతో జగన్మోహన్ రెడ్డి ఎన్నికల అనంతరం ఓటమి భయంతో లండన్ వెళ్లిపోతు న్నారని విమర్శించారు. స్థానికంగా చాగలమర్రిలో ఉన్న మినీ ఎమ్మెల్యే ఊరిలో ఏది చెబితే అది జరగాలని చేస్తున్నారంట కదా అని ఆరోపించారు. ఆళ్లగడ్డకు మూడు పరిశ్రమలు, నిరుద్యోగ యువతకు ఐదువేల ఉద్యోగాలు తీసుకువస్తామన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బైరెడ్డి శబరిలను సైకిల్ గుర్తుపై ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీన లాయర్ నరసింహారెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ భాష, నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి, కొలిమి బాబు, షరీఫ్ గారి మౌలాలి, గఫార్, మహబూబాద్, జట్టి నాగరాజు, రియాజ్, జహీర్ వలి, హుస్సేన్ భాష, అబ్దుల్లా, టైలర్ ఖాదర్, ముల్లా అజీమ్, కరిముల్లా, నూర్ బాషా, ఇర్షాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే వారికే పట్టం కట్టండి : అఖిలప్రియ

ఆళ్లగడ్డ : నియోజకవర్గ ప్రజలు ఒక్కసారి ఆలోచన చేసి. అభివృద్ధి చేసే వారికే పట్టం కట్టాలని ఆళ్లగడ్డ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం ఆళ్లగడ్డ మున్సిపాల్టీలోని పడకండ్లలో ప్రజా గళం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా భూమా అఖిలప్రియ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కావాలంటే ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో వైసిపి పాలనకు చరమగీతం పాడాలన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బైరెడ్డి శబరిలకు సైకిల్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చింతకుంట రామశేఖర్ రెడ్డి, బద్రి సుధాకర్ రెడ్డి, పెట్రోల్ బంక్ రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రోడ్ షోలో పాల్గొన్న భూమా అఖిలప్రియ, ఇరిగెల రాంపుల్లారెడ్డి తదితరులు

మూగబోయిన మైకులు - ముగిసిన ప్రచార పర్వం

ప్రజాశక్తి - బనగానపల్లె

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బనగానపల్లె నియోజకవర్గంలో నెల రోజులుగా హోరెత్తించిన మైకులు ఒక్కసారిగా మూగబోయాయి. ఎన్నికల ప్రచార పర్వం శనివారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. దీంతో నియోజకవర్గం అంతా ఒక్కసారిగా ప్రశాంతంగా మారిపోయింది.

ఆంక్షలివే.. ఉల్లంఘిస్తే కఠిన చర్యలే

- ఎన్నికలు ముగిసే వరకు పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఐదుగురు మించి ఎక్కడైనా గుమ్మిగూడితే చర్యలు తీసుకుంటారు.
- ఎన్నికలు ముగిసే వరకు రెండు రోజుల పాటు (11వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు) వైన్ షాపులు, బార్లు మూయాలి. లిక్కర్ అమ్మకాలు నిషేధం.
- పోలింగ్ ముంగిట ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే ప్రయత్నాలు జరుగకుండా పోలీసులు డేగ కన్ను వేస్తారు.
- ఎన్నికల ఊరేగింపులు, ర్యాలీలు, సినిమాలు, టీవీల ద్వారా ప్రచారం నిర్వహించడం నిషేధం.
- మొబైల్స్ ద్వారా ఎన్నికల సందేశాలను పంపించడం, ఒపీనియన్ సర్వేలు వెల్లడించడం నిషేధం.
- ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే రెండేళ్ల జైలు శిక్ష లేదా భారీ జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది.


నెమలిని ఫారెస్ట్ అధికారులకు అప్పజెప్పుతున్న దృశ్యం

పగిడ్యాలలో నెమలి లభ్యం

- ఫారెస్ట్ అధికారులకు అప్పగించిన వెల్ఫేర్ అసిస్టెంట్

ప్రజాశక్తి - పగిడ్యాల : మండల కేంద్రం పగిడ్యాలలో నెమలి లభ్యమైనట్లు వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్ శనివారం తెలిపారు. వివరాలు.. పగిడ్యాలలోని కొణిదెల రోడ్డులో మండ్ల బిచ్చన్న ఇంటి ఆవరణలోకి నెమలి వచ్చింది. నెమలి రావడం చూసిన కుక్కలు వెంబడించడంతో నెమలి ముళ్లపొదలోకి వెళ్లింది. దీంతో నెమలికి స్వల్ప గాయాలయ్యాయి. మండ్ల బిచ్చన్న కుమారుడు మండ్ల రాము వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్‌కు సమాచారం అందించాడు. ఆయన తక్షణమే అక్కడికి చేరుకొని ఆత్మకూరు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ బీట్ అధికారి ఎస్ఎస్ పీరా పగిడ్యాల గ్రామానికి రావడంతో నెమలిని అప్పగించారు.

వైసిపి నుండి టిడిపిలోకి చేరిక

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామం వైసిపి నాయకులు, సింగిల్ విండో మాజీ చైర్మన్, మద్దూర్ హరి సర్వోత్తమ్ రెడ్డి, కాజా మొహిద్దీన్, డాక్టర్ మాలిక్, జాఫర్ తదితరులు శనివారం టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయసూర్య సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

టిడిపికి మద్దతుగా వికలాంగులు ప్రచారం

ప్రజాశక్తి - వెలుగోడు : టిడిపికి మద్దతుగా వికలాంగులు శనివారం వెలుగోడు పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శ్రీశైలం టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరిలను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో వికలంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, ఇంతియాజ్, నురుల్లమీన్, ఎల్లమ్మ, ముక్తియర్, విష్ణువర్ధన్, సుంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి : వెంకటరమణయ్య

ప్రజాశక్తి - బనగానపల్లె : 'బిసి బిడ్డగా మీ ముందుకు వచ్చాను ఆదరించండి' అని బనగానపల్లె ఇండిపెండెంట్ ఎంపీ అభ్యర్థి జి.వెంకటరమణయ్య ఓటర్లను కోరారు. శనివారం మండలంలోని పలుకూరు గ్రామంలో నంద్యాల ఎంపీ ఇండిపెండెంట్ అభ్యర్థి జి.వెంకట రమణయ్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బిసి బిడ్డగా మీ ముందుకు వచ్చానని జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు ఆదరించాలని కోరారు. మత్స్యకారులు బీసీల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని, ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో రిమోట్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బెస్త సంఘం నాయకులు, బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించండి

పజాశక్తి - ఆళ్లగడ్డ

ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఎస్.లింగందిన్నె గ్రామ సర్పంచ్ ఇరిగెల విశ్వనాథరెడ్డి అన్నారు. శనివారం ఆళ్లగడ్డ మండలం లింగందిన్నె గ్రామ నందు జనసేన–టిడిపి ఉమ్మడి కూటమి ఆళ్లగడ్డ అభ్యర్థి అఖిలప్రియ, ఎంపీ అభ్యర్థి శబరి తరఫున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరిగెల సుధాకర్ రెడ్డి మరియు జనసేన నాయకులు, కార్యకర్తలు, ఇరిగెల బ్రదర్స్ అభిమానులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

అరటి రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో గాలివాన వల్ల విపరీతంగా అరటి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం మహానంది మండలం గాజులపల్లె, మహాదేవపురం, బసాపురం, గోపవరం, మహానంది, తిమ్మాపురం గ్రామాల్లో వందలాది ఎకరాల్లో దెబ్బతిన్న అరటి పంటలను ఎపి రైతు సంఘం ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అరటి గొలలు అమ్ముకొనే సమయంలో అకాల వర్షం, గాలుల వల్ల చెట్లు పూర్తిగా నేలమట్టానికి పడిపోవడంతో లక్షలాది రూపాయలు నష్టపోయారని చెప్పారు. పెట్టుబడి కోసం విపరీతంగా అప్పులు చేశారని, ప్రస్తుతం ప్రకృతి కోపానికి రైతులంతా తీవ్రంగా నష్ట పోయారని తెలిపారు. ప్రభుత్వ పాలకులు అరటి రైతాంగానికి ఎకరాకు లక్ష రూపాయల పంట నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, జిల్లా ఉపాధ్యక్షుడు వి. సుబ్బారాయుడు, వ్యకాసం నాయకులు కోటకొండ బాషా, రైతులు మద్దిలేటి, షేక్ ఉస్మాన్ భాష, తూము రామ చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న నాయకులు


ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి : కామేశ్వరరావు

ప్రజాశక్తి - బనగానపల్లె

ఈ నెల 13న జరిగే ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బనగానపల్లె నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు 12వ తేదీ తరలివెళ్లనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో 2,4179 ఓట్లకు 277 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్‌కు 1662 మంది సిబ్బంది, 60 మంది మైక్రో అబ్జర్వర్, 40 మంది వీడియో గ్రాఫర్లను ఏర్పాటు చేశామన్నారు. 28 రూట్లు, 75 బస్సులను ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో 80 శాతం పోలింగ్ కేంద్రాలలో వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. **శ్రీశైలం ప్రాజెక్టు :** శ్రీశైల మండలం సున్నిపెంటలో ఏర్పాటు చేస్తున్న ఆయా పోలింగ్ బూతులను తహసీల్దార్ గుర్రప్ప శనివారం పరిశీలించారు. తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 27 పోలింగ్ బూత్‌లు ఉండగా 1 నుండి 10 వరకు శ్రీశైలం దేవస్థానం, 11 నుండి 26 వరకు సున్నిపెంటలో, మండలంలోని లింగాలగట్టులో 27వ బూత్‌ను బోయ క్యాంపు నందు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, స్థానిక జలవనరుల శాఖ ఏఈ చిట్టిబాబు, సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్ రవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు

యువతి అదృశ్యం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందివర్గం గ్రామానికి చెందిన సంపంగి సాయి లావణ్య (19) అదృశ్యమైనట్లు నందివర్గం ఎస్ఐ తిరుపాల్ శనివారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ సంపంగి సుబ్బలక్షమ్మ కుమార్తె సంపంగి సాయి లావణ్య బయటికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని ఫిర్యాదు చేయడంతో అదృశం కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.


సాయి లావణ్య

టిడిపితోనే మండలం అన్ని విధాలా అభివృద్ధి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

టిడిపితోనే కొలిమిగుండ్ల మండలం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు ఓబాల్ రెడ్డి అన్నారు. శనివారం కొలిమిగుండ్ల మండలంలోని ఇటిక్యాల గ్రామంలోని ఆయన స్వగృహంలో విలేకరుతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బనగానపల్లె ఎమ్మెల్యేగా బీసీ జనార్ధన్ రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. మండలంలో రాంకో భూములలో రైతులు పంటలు సాగు చేసుకునేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. గత ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విజయానికి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి అండగా ఉన్నప్పటికి మండల అభివృద్ధికి వారు చేసింది ఏమి లేదన్నారు. అల్ట్రాటెక్, రాంకో, ప్రిజం, దాల్మియా, పవర్ గ్రిడ్, రాంకో రైల్వే లైన్ తదితర వాటిలో ఎర్ర బోతుల, కాటసాని, సీఎంఓ చెప్పుకునే కొందరు పనులను దక్కించుకుంటూ మిగిలిన వారి నోట్లో మట్టి కొట్టుతున్నారన్నారు. బీసీ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కొలిమిగుండ్ల మండలం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఓ శివ ప్రసాద్ రెడ్డి, ఓ మదన్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతన్న నాయకులు

అభివృద్ధి చేసాం.. మరోసారి ఆశీర్వదించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని.. రానున్న ఎన్నికల్లో మరోసారి తనను ఆశీర్వదించాలని ఆళ్లగడ్డ శాసనసభ్యులు, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల బిజేంద్రరెడ్డి ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని ఓబులంపల్లి, కోట కందుకూరు గ్రామాలలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మన రాష్ట్రంలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించారని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. జగనన్న పాలనలో తెలుగు గంగ ప్రధాన కాలువ బ్లాక్ ఛానల్ లను పిల్లకాలువలను మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందించడం జరిగిందని వివరించారు. చంద్రబాబు మాయమాటలతో ఎవరు మోసపోవద్దని, పేద ప్రజలు సంతోషంగా ఉండాలంటే జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసీపీని గెలిపించాలని ఎంపీ అభ్యర్థి పోచ బ్రహ్మానంద రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి, రాచం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, రామిరెడ్డి , రామకృష్ణ, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కోట కందుకూరు రోడ్ షోలో పాల్గొన్న ఎమ్మెల్యే

వన్యప్రాణులను వేటాడారని

వేటగాళ్లతో రహస్య విచారణలో ఆంతర్యమేమిటో..?

- అటవీశాఖ అధికారులు ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు

- నంద్యాల కోర్టుకు తీసుకెళ్తుండగా వాహనం అడ్డగించిన నిందితుల బంధువులు

ప్రజాశక్తి - మహానంది.

మహానంది మండలం కృష్ణనంది సమీపంలోని ప్రేమ బీట్ నందు నల్లమల అటవీ ప్రాంతంలో గత నాలుగు రోజుల క్రితం అడవి జంతువులను వేటాడారనే నెపంతో మహానంది గ్రామానికి చెందిన ఐదుగురు వేటగాళ్లను అదుపులోకి తీసుకొని రహస్యంగా విచారించడంలో ఆంతర్యమేమిటని నిందితుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు బుధవారం ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్టు, వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. అయితే అదుపులో ఉన్న ఐదుగురు నిందితులలో సురేష్ వద్ద రెండు లక్షల రూపాయలు లంచం తీసుకొని బయటికి పంపారని మిగతా నిందితుల బంధువులు ఆరోపిస్తున్నారు. శనివారం మిగతా నలుగురిని మహానంది నుండి నంద్యాల కోర్టుకు తరలిస్తుండగా వారి బంధువులు వాహనాన్ని అడ్డగించి, అధికారులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో అటవీశాఖ అధికారులు నిందితులను తిరిగి మహానందిలోని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న రేంజర్ దినేష్ కుమార్ రెడ్డి అక్కడికి చేరుకుని మహానంది అటవీశాఖ సిబ్బందిని ఈ విషయంపై మందలించారు. నిందితులను అరెస్టు చేసినట్లు మీడియాకు తెలిపారు.

వన్యప్రాణులకు, అటవీ సంపదకు రక్షణ కరువు : అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు రక్షణ కరువైనా పట్టించుకునే అధికారి లేరనే వాదన మండలంలో విమర్శలు గుప్పిస్తుంది. అధికారులు చాలా పర్యాయాలు కూడా, అడవి జంతువుల వేటగాళ్లను డబ్బులు తీసుకొని, కేసు లేకుండా చేశారని వాదన కూడా బలంగానే వినిపిస్తోంది. అసలు మహానంది అటవీ కార్యాలయంలో ఏమి జరుగుతుందో అర్థం కాని పరిస్థితి. గత నాలుగు రోజుల క్రితం వన్యప్రాణులను వేట జరిగిందని, ఐదుగురిని అదుపులోకి తీసుకొని, విచారణ పేరుతో వేధిస్తున్నారని బాధితుల ఆరోపిస్తున్నారు. వేటగాళ్లను పట్టుకుంటే, నాలుగు రోజులుగా విచారణ ఏమిటో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మీడియాకు విషయం తెలిసినా ఇంకా రెండు రోజులు విచారణ ఉందని బుకాయింపు మాటలు చెప్పే అధికారులు అంత విచారణ ముగిశాక ప్రెస్‌నోట్ విడుదల చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది. అధికారులు సత్వరమే వన్యప్రాణులు, అటవీ సంపద సంరక్షణ కోసం మహానంది నల్లమల అటవీ ప్రాంతంలో ఏమి జరుగుతుందో పరిశీలించి, అధికారులు ఏం చేస్తున్నారో నిఘా ఉంచి తగు చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు, అటవీ ప్రేమికులు కోరుతున్నారు.


అటవీశాఖ అధికారుల వాహనాన్ని అడ్డుకున్న నిందితుల బంధువులు

ప్రలోభాలకు వేళాయెరా..!

- ముగిసిన ప్రచార పర్వం
- ఓటర్లను ప్రసన్నం చేసుకునే యత్నం
- మొదలైన నగదు, మద్యం పంపిణీ

ఎన్నికల ప్రచార పర్వం ముగియడంతో అభ్యర్థులు ఇక ప్రలోభాల పర్వానికి తెరలేపారు. ఇప్పటికే ఆర్థిక వనరులు సమీకరించుకున్న అభ్యర్థులు నోట్ల కట్టలు విప్పుతున్నారు. డబ్బులు ఎక్కడ, ఎవరికి పంపాలో అంతా ముందుగానే పకడ్బందీగా ప్రణాళిక వేసుకున్నారు. ఓటుకు నోటు, మద్యం సీసాలు, మహిళలకు కానుకలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో ఓటుకు రూ.500 ఇస్తున్నట్లు తెలిసింది. గత ఎన్నికల కంటే రూ.200 పెంచి ఇస్తున్నట్లు సమాచారం.



ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల లెక్కలు తీసుకుని డబ్బుల సంచుల మూటలు విప్పుతున్నారు. వీలున్న వారికి ఆన్‌లైన్‌లోనే గూగుల్ పే, ఫోన్ పే చేస్తున్నారు. స్థానికంగా ఉండే ఓటర్ల ఇళ్లకే వెళ్లి నోట్లు పంచుతున్నారు. ఇక కొందరు ఓటర్లే తమ ఇంట్లో ఎన్ని ఓట్లున్నాయో చెప్పుకొంటూ డబ్బులు పంచే మనిషి దగ్గరికి వెళ్లి నేరుగా అడిగి తీసుకుంటున్నారు. రెండు ప్రధాన పార్టీలు పోటాపోటీగా పైసల పంపకానికి సిద్ధపడ్డాయి. డబ్బు పంపిణీలో ఓ పార్టీ కాస్త వెనుకబడింది. ఆదోని నియోజకవర్గంలో అభ్యర్థులంతా దాదాపు ఒకే స్థాయిలో ఖర్చు చేస్తుండడం గమనార్హం.

ఆలోచించి, అడుగువేస్తూ...

అభ్యర్థులు ప్రతి పైసా ఆలోచించి ఖర్చు చేసేలా అడుగువేస్తున్నారు. ఎన్నికల్లో కనీస ఓట్లు రాక ఘోరంగా ఓడిపోతే రాజకీయ భవిష్యత్తు ఇబ్బందిగా మారుతుందని కూడా తాయిలాలు పంచుతున్నారు. ఇప్పటికే పార్టీ ఫండ్ కొంత మేర ముగ్గురు అభ్యర్థులకు అందింది. స్వతంత్ర అభ్యర్థులు మాత్రం ఓటర్లపైనే భారం వేసి దండం పెట్టి ఓటేయాలని చెప్పి ఊరుకున్నారు.

రెండు దఫాలుగా పంపిణీ..?

నియోజకవర్గంలో రెండు రోజులుగా ఓటర్లకు డబ్బులు చేరుతున్నాయి. మొదటి దశలో కొంత తీసుకొమ్మని అడ్వాన్స్‌ల రూపంలో ఇస్తున్నారు. అలాగే మద్యం సీసా కూడా ఆ ఇంటి మగవారి చేతిలో పెడుతున్నారు. మళ్లీ రెండో దఫాలో మరో లిక్కర్ సీసా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రత్యర్థి ఎంత పంచుతాడనే కోణంలో రెండు దఫాలుగా ఇస్తామని చెబుతున్నట్లు తెలిసింది. గత ఎన్నికల్లో ఇచ్చినట్లు ఇస్తే లెక్క కుదరని ఇప్పటికే నాయకులు అభ్యర్థులకు చెబుతున్నారు. దీంతో కాస్త రేటు పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అభ్యర్థులు పోటీ పడుతున్నట్లు ప్రలోభాలకు పాల్పడుతున్నారు. మరో నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల్లో పంపకాలు ప్రారంభమయ్యాయి. పట్టణ ప్రాంతాల్లో కూడా కొన్ని కాలనీల్లో పంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అధికారుల ప్రత్యేక నిఘా...

ప్రచారం ముగియడంతో ఎక్కడికక్కడ అధికార యంత్రాంగం అభ్యర్థులు పంచే తాయిలాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. గుమిగూడినా, అనుమానాస్పదంగా తిరిగినా చర్యలు తీసుకుంటున్నారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. నగదు, మద్యం డంపులపై ప్రత్యేక దృష్టి సారించి పల్లెలు, పట్టణాల్లోని రాజకీయ నాయకుల ఇళ్లలో సోదాలు చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థుల నుంచే ఫిర్యాదులు వెళ్తుండడంతో ఆ మేరకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మరోవైపు ఎన్నికల అధికారులు ఓటర్లు ఎలాంటి తాయిలాలకు లొంగవద్దని, నిర్భయంగా ఓటు వేయాలని కోరుతున్నారు.

సూపర్ సిక్స్ పథకాలే టిడిపి గెలుపునకు నాంది

- టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్

ప్రజాశక్తి - ఆలూరు

చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలే టిడిపి గెలుపునకు నాంది అని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మనేకుర్తి రాజశేఖర్ తెలిపారు. శనివారం ప్రచారంలో భాగంగా మనేకుర్తి గ్రామ పరిధిలో ఉపాధి కూలీల పని ప్రదేశానికి వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి పథకాలకు, టిడిపి ఇవ్వబోయే పథకాలకు వ్యత్యాసం తెలిపారు. గత ప్రభుత్వంలో ఇచ్చింది గోరంత.. ప్రజల నుంచి లాకున్నది కొండంత అని చెప్పారు. మన పిల్లల, గ్రామ, రాష్ట్ర భవిష్యత్తు కోసం వైసిపిని ఓడించాలని తెలిపారు. టిడిపి కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బి.వీరభద్ర గౌడ్ సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు ఆల్లప్ప, ఎం.నారాయణ, బంగి దేవేంద్ర, మూలింటి దేవేంద్ర, దాదావలీ, గర్జి దేవేంద్ర, మౌలాలి, పరుసప్ప, కోతి గాదిలింగ, సిద్ధ రామన్న, బాలు, జనసేన నాయకులు రాజశేఖర్, సామ్యేల్, రాజు పాల్గొన్నారు.



కూలీలకు పథకాలను వివరిస్తున్న రాజశేఖర్

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

- టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టిడిపితోనే రాష్ట్రాభి వృద్ధి సాధ్యమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐదేళ్లుగా అడ్రస్ లేని వైసిపి నాయకులు ఓట్ల కోసం రూ.కోట్లు పట్టుకొని ఎమ్మిగనూరులో అడుగుపెట్టారని విమర్శించారు. ఓట్ల కోసం డబ్బు సంచులతో ప్రజలను మోసం చేయడానికి వచ్చిన వైసిపి నాయకులని ఎట్టి పరిస్థితుల్లో ఓడగొట్టాలని కోరారు. టిడిపి అధికారంలోకి రాగానే ఈ దుర్మార్గపు ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేస్తామని తెలిపారు. ఎమ్మిగనూరు అభివృద్ధి చెందాలంటే టిడిపితోనే సాధ్యమని చెప్పారు. ప్రజలందరూ మద్దతుగా నిలవాలని, భారీ మెజారిటీతో సైకిల్ గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. పట్టణ నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న బీవీ

చివరిరోజు హోరాహోరీగా ప్రచారం

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని కనకవీడు గ్రామంలో ప్రచారం చివరి రోజు కావడంతో శనివారం ప్రచారం హోరాహోరీగా సాగింది. కనకవీడులో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి గెలుపు కోసం టిడిపి సీనియర్ నాయకులు, మాజీ వైస్ ఎంపిపి కె.రఘుమూర్తి స్వామి, ఆయన సతీమణి గీతాబాయి కలిసి దాదాపు 200 మంది మహిళలు, పురుషులతో ప్రచారం నిర్వహించారు. ఆయన ఇంటి నుంచి బీసీ, కింది గేరి, పైగేరి, ఎస్సీ కాలనీల్లో వీధుల గుండా నడుచుకుంటూ ప్రచారం చేపట్టారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ.జయ నాగేశ్వర రెడ్డికి, ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి సిఎంను చూడలేదని తెలిపారు. అభివృద్ధిని గాలికి వదిలేసి, సంక్షేమం పేరిట ఒకవైపు ప్రజలకు డబ్బులు ఇస్తూ, మరోవైపు డబ్బులను లాగేస్తున్నారని ఎద్దేవా చేశారు.



ప్రచారం నిర్వహిస్తున్న రఘుమూర్తి స్వామి



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

భవిష్యత్తు మారాలంటే.. బాబు రావాలి

- టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి - కౌతాళం

ప్రజల భవిష్యత్తు మారాలంటే.. చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ అడివప్ప గౌడ్ తెలిపారు. శనివారం మండలంలోని వల్లూరు గ్రామంలో విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల భవిష్యత్తు మారాలంటే చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావాలని తెలిపారు. చంద్రబాబు పాలనలోనే ప్రజలు సుభిక్షంగా ఉంటారని చెప్పారు. ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జగన్‌కు ఓటు రూపంలో బుద్ధి చెప్పాలని సూచించారు. ఈనెల 13న సోమవారం రోజున జరిగే పోలింగ్‌లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డికి, ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

అభివృద్ధి చేసే నాయకుని ఎన్నుకోవాలి

- వైసిపి నాయకులు సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

అభివృద్ధి చేసే నాయకుడు వై.బాల నాగిరెడ్డిని ఎన్నుకోవాలని వైసిపి రౌడూరు నాయకులు సుధాకర్ రెడ్డి ఓటర్లను కోరారు. శనివారం ఆయన మాట్లాడారు. రెండు రోజులుగా గ్రామంలో ముమ్మరంగా ప్రచారం చేశామన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం జగన్మోహన్ రెడ్డి కృషి చేశారని తెలిపారు. విద్య, వైద్య రంగంతోపాటు వ్యవసాయం, అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టిన వైసిపికి భారీ మెజారిటీ అందిస్తామన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో, ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వై.బాలనాగిరెడ్డి అందజేశారని తెలిపారు.



ప్రచారం నిర్వహిస్తున్న సుధాకర్‌రెడ్డి

జగన్‌ను గెలిపిద్దాం

- సొసైటీ ఛైర్మన్ మల్లికార్జున



ఈవిఎంలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - చిప్పగిరి

నిరుపేద ప్రజలపై మమకారం, అభిమానం ఉన్న జగన్మోహన్‌రెడ్డిని గెలిపిద్దామని బెల్డోన సొసైటీ ఛైర్మన్ మల్లికార్జున ఉపాధి హామీ కూలీలను కోరారు. శనివారం వైసిపి సీనియర్ నాయకులు లాలు స్వామి ఆధ్వర్యంలో డేగలపాడు గ్రామంలో ఉపాధి హామీ పనులు చేసే ప్రాంతాల్లో కూలీల దగ్గరకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. వైసిపి మేనిఫెస్టోలో ఉన్న పథకాలను వివరిస్తూ ఈవిఎంలపై ఫ్యాను గుర్తుకు ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బి.విరుపాక్షి, కర్నూలు ఎంపీ అభ్యర్థి బివై.రామయ్యను గెలిపించేందుకు ఈనెల 13న ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. వైసిపి డేగలపాడు గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద వాల్మీకులకు నా ఆస్తి రాసిస్తా

- నీవు సిద్ధమా..?
- టిడిపి అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డికి ధరణీధర్ రెడ్డి సవాల్

ప్రజాశక్తి - మంత్రాలయం

'నియోజకవర్గంలోని పేద వాల్మీకుల సంక్షేమం కోసం నా వాటాకు వచ్చే ఆస్తిని ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను. వాల్మీకుల బంధువుగా చెప్పుకునే నువ్వు నీ ఆస్తి రాసి ఇవ్వడానికి సిద్ధమా' అని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డికి వైసిపి యువ నేత వై.ధరణీధర్ రెడ్డి సవాల్ విసిరారు. శనివారం మండలంలోని వగరూరు, తిమ్మాపురం గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీలపై వాల్మీకుల కపట ప్రేమ చూపొద్దని తెలిపారు. తన సిఫారసుతో రాఘవేంద్రరెడ్డి తండ్రి రామిరెడ్డికి కెడిసిసి ఛైర్మన్ పదవి వచ్చిందని గుర్తు చేశారు. వైసిపిలో పదవులు అనుభవించి, సంపాదించుకొని నేడు తన తండ్రి బాలనాగిరెడ్డిని వ్యక్తిగతంగా విమర్శించడం తగదన్నారు. 'మీ సొంత పెద్దమ్మ మీ ఊళ్లో కూలి పనులకు వెళ్లడం చూస్తే తెలుస్తుంది మీరెంత సహృదయులో' అని విమర్శించారు. కుటుంబ సభ్యులను ఆదరించని రాఘవేంద్రరెడ్డి తోటి కులస్తులకు ఇంకేం చేస్తారని ఎద్దేవా చేశారు. పులికనుమ నుంచి కోసిగికి నీరిచ్చే వరకు అడుగు పెట్టనని మాట ఇచ్చానని, అందుకే ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనార్థం మాధవరం గ్రామం పెద్దతుంబళం మీద వెళ్లానని తెలిపారు. ప్రతి ఇంటికీ కుళాయి ఇచ్చే వరకు మీ ఊర్లకు కూడా రానని చెప్పారు. గ్రామాల్లో తగాదాలు లేకుండా ప్రశాంతంగా ఉండాలని, బంధాలు, బంధుత్వాలు కలుపుకుని వచ్చే వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. మంచి చేసింటేనే తన తండ్రికి ఓటు వేయాలని కోరారు. ఈనెల 13న జరిగే పోలింగ్‌లో వైసిపి ఎంపీ అభ్యర్థి బివై.రామయ్యకు, ఎమ్మెల్యే అభ్యర్థి వై.బాలనాగిరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. వైసిపి మండల అధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సర్పంచి లింగారెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధరణీధర్ రెడ్డి

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - ఆలూరు

ఆస్పరి మండలంలోని రైల్వే గేటు వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా బజాజ్ ఆటోలో తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఆలూరు సెబ్ సిఐ సోమశేఖర్ తెలిపారు. రైల్వే గేటు వద్ద తనిఖీ చేస్తుండగా బజాజ్ ఆటోలో తరలిస్తున్న కర్ణాటక టెట్రా 9 బాక్సులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆస్పరి మండలం కైరుప్పల గ్రామానికి చెందిన కె.దశరథ రామయ్య, ఎం.యువరాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న ఈడిగ ఈరన్నను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. హెచ్‌సిలు శ్రీనివాసులు, మహేశ్వర్ రెడ్డి, ఈసీలు నాగరాజు, రామలింగ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

రెండు లక్షలు స్వాధీనం..

ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి

ప్రజాశక్తి-పత్తికొండ



ఈనెల 13న జరిగే పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసినట్లు పత్తికొండ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నీలపు రామలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఆర్‌డిఒ కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి నీలపు రామలక్ష్మి మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గంలోని పత్తికొండ, తుగ్గలి, మద్దికేర ,క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లోని 2,23,605 ఓటర్లకు గాను 255 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 13న ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఓటు హక్కును ఓటర్లు వినియోగించుకోవాలని అన్నారు. వెల్దుర్తి మండలం చెరుకులపాడు గ్రామంలో ఓటర్లకు నగదు పంపిణీ చేయు వారి నుండి రూ. రెండు లక్షల స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటర్లు ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని కోరారు.

13న జిల్లాలోని అన్ని కోర్టులకు సెలవు

ప్రజాశక్తి-కర్నూలు లీగల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు మే 13న సాధారణ ఎన్నికల నిర్వహణ సందర్భంగా కర్నూలు జిల్లాలోని అన్ని కోర్టులకు సెలవును ప్రకటించినట్లు కర్నూలు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ ఎన్. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కోర్టు కార్యకలాపాలు సోమవారం సెలవు రోజు కావడంతో జరగవని పేర్కొన్నారు.

ఆర్‌టిసి బస్సుల ద్వారా ఉచిత రవాణా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 12న పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది వారికి కేటాయించిన నియోజకవర్గాల డిస్పాచ్ సెంటర్లకు వెళ్లేందుకు ఆర్‌టిసి బస్సుల ద్వారా ఉచిత రవాణా సదుపాయం కల్పిస్తామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు వారికి కేటాయించిన నియోజకవర్గాల డిస్పాచ్ సెంటర్లకు వెళ్లేందుకు 120 బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ బస్సుల్లో ప్రయాణించే ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు ఉచిత రవాణా కల్పించడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. మే 12న ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఉ.4:30, ఉ.5:30, 6:30 గం.లకు కర్నూలు నుండి పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, కోడుమూరు నియోజకవర్గాలకు వెళ్లేందుకు, అదే విధంగా 12న ఉ.4:30, ఉ.5:30, 6:30 గం.లకు పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, కోడుమూరు నియోజకవర్గాల నుండి కర్నూలుకు వెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని బస్ స్టేషన్లలో ప్రత్యేక బస్సు కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కేంద్రాలకు ముందు రోజే 12న సాయంత్రానికి పోలింగ్ సిబ్బంది చేరుకుంటారని కలెక్టర్ తెలిపారు. సిబ్బందికి అల్పాహారం, భోజనం ఏర్పాటు శామన్నారు.



కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అధ్యక్షులు బాబురావు

కాంగ్రెస్ పార్టీలో చేరిన నాగార్జున

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరం నర్సింహారెడ్డి నగర్ కు చెందిన గంటె పోగు నాగార్జున కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఇ లాజరస్ ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె.బాబు రావు పార్టీ కార్యాలయంలో నాగార్జునకు పార్టీ కండువా వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, కాంగ్రెస్ ఎస్‌సి సెల్ జిల్లా చైర్మన్ ఈ లాజరస్, జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాద్రి బాషా, మైనార్టీ సెల్ సిటీ అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్ మొదలగువారు పాల్గొన్నారు.

కోవిడ్‌లో ప్రజలకు అండగా ఉన్నాం: మంత్రి బుగ్గన

అభివృద్ధి చేశాం ఆదరించండి : చివరి రోజు మంత్రి విజ్ఞప్తి

ప్రజాశక్తి -డోన్/ ప్యాపిలి

కోవిడ్ విపత్తులో భయంతో మనుషులు లేక నిర్మానుష్యంగా మారిన రోజుల్లో తిరిగి రాష్ట్ర ప్రజలను కాపాడుకున్నామని, అండగా నిలిచామని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. బయటికొస్తే ఏమవుతుందో తెలియని భయాందోళనలో కూడా ధైర్యంగా ప్రజలకు భరోసానిచ్చామన్నారు. నాడు కోవిడ్ కాలంలో కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి ఏం చేశారని ప్రశ్నించారు. శనివారం డోన్ పట్టణం పాతబస్టాండ్ సర్కిల్ సమీపంలో చివరిరోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఫ్లై ఓవర్ నుంచి పాత బస్టాండ్ గాంధీబొమ్మ సర్కిల్ దగ్గరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం బహిరంగ సభలో మంత్రి బుగ్గన మాట్లాడారు. తాను అందుబాటులో లేనని ప్రచారం చేస్తున్న కూటమి అభ్యర్థి కోట్లకు డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా రూ.3,500 కోట్లతో పూర్తి చేసిన 195 ప్రాజెక్టుల అభివీద్ధి కనపడలేదా అని ప్రశ్నించారు. ఎక్కడా సీటివ్వలేమని తేల్చి చెబితే అన్ని ప్రయత్నాలు చేసి గత్యంతరం లేక డోన్‌కు వచ్చి అడ్డా అంటారా అని మండిపడ్డారు. డోన్ కోట్ల అడ్డా అయితే టిడిపి కార్యాలయం ఫంక్షన్ హాల్‌లో ఎందుకు పెట్టుకున్నారో చెప్పాలని నిలదీశారు. ఇటీవల గృహ ప్రవేశం చేసి పూజలు నిర్వహించిన ఇల్లైనా కోట్ల సొంతమా కాదా అనడిగారు. ఎంపీగా, కేంద్ర మంత్రిగా పదవులు అనుభవించిన కోట్ల డోన్‌కు ఏం చేశారో చెప్పగలరా అని సూటిగా ప్రశ్నించారు. నీతి, అవినీతికి మధ్య యుద్ధమని కోట్ల మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. డోన్‌లో ఫ్లైఓవర్ పొడవు ఎందుకు పెరుగుతూ పోయిందో ప్రజలకు చెప్పాలన్నారు. అంగళ్లు, బియ్యం, బెల్లం అన్నింటిపై వసూళ్లు, దందాలు చేసిందెవరో స్పష్టతనిస్తే బాగుంటుందన్నారు. కీలకమైన రాష్ట్ర విభజన సమయంలో వంటవార్పులతో సీమ ప్రజలు రోడ్ల మీద పడితే ఆయనకు కేంద్ర మంత్రి పదవి ఏ నీతిలో ఏ రీతిలో వచ్చిందో చెప్పాలన్నారు. అల్లర్లు కాకుండా చూసేందుకు సోనియా గాంధీకి హామీ ఇచ్చి చీకటి ఒప్పందంతో రైల్వే కేంద్ర మంత్రి అయిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గత ఐదేళ్ల వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క అవాంఛనీయ సంఘటన, ఘర్షణ జరిగిందా అని ప్రజలను అడిగారు. 'ఇద్దరు 'కే'లు ఒక్కటయ్యామని వేదికపై చేతులెత్తి చెబుతున్నారని, మీరు వేరై..రక్తం ఏరై.. ఎన్నో అమాయాక ప్రాణాలను బలిగొన్నప్పుడు.. ఆ కుటుంబాల మనోవ్యథని మీ కలయిక తీరుస్తుందా' అని ఘాటుగా ప్రశ్నించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించిన వైసిపికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



డోన్‌లో భారీ బహిరంగసభలో మాట్లాడుతున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బుగ్గనను అత్యధిక మెజార్టీతో గెలిపించండి : ప్రముఖ పారిశ్రామికవేత్త బుగ్గన సంజీవరెడ్డి

బేతంచర్ల : డోన్ ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి బుగ్గనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మంత్రి సోదరుడు, ప్రముఖ పరిశ్రామికవేత్త బుగ్గన సంజీవరెడ్డి, మండల ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి ప్రజలను కోరారు. శనివారం బేతంచెర్ల పట్టణం దుర్గా పేట కాలనీలో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బుగ్గనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సురేంద్ర నాథ్ రెడ్డి, రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ మురళీకృష్ణ, దుర్గాపేట కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెరగాలి : జిల్లా ఎన్నికల అధికారి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈ సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇవిఎంలను ఫస్ట్ లెవెల్ చెక్ అప్ చేయడంతో పాటు ఇవిఎమ్ కమిషనింగ్ చేసి ఏ ఇవిఎమ్‌లు పని చేస్తున్నాయని చెక్ చేయడంతో పాటు, పని చేయని ఇవిఎమ్ మెషీన్‌లను తీసేస్తామన్నారు. అందుకే ఈసారి ఇవిఎంల రీప్లేస్మెంట్ ఉండకపోవచ్చునన్నారు. అనుకోని పరిస్థితులలో ఏదైనా ఇవిఎమ్ రీప్లేస్‌మెంట్ చేయాల్సి వస్తే సంబంధిత పోలింగ్ కేంద్రానికి సెక్టార్ అధికారులు, బెల్ ఇంజనీర్లు వెళ్లి రీప్లేస్‌మెంట్ చేయుటకు ఎంత సమయం పడుతుందనే దానిమీద మరల ఒకసారి ప్రాక్టీస్ చేయాలని కలెక్టర్ అధికారులను డిస్పాచ్ సెంటర్ల వద్ద ఇవిఎం మెషీన్ డెమాన్‌స్ట్రేషన్‌కు సంబంధించిన కౌంటర్, వివి ప్యాట్, కంట్రోల్ యూనిట్ , బ్యాలెట్ యూనిట్లు ఏ విధంగా కనెక్ట్ చేయాలనే వీడియోల ప్రదర్శనకు స్క్రీన్లు, అదే విధంగా ఎవరికైనా ఏమైనా సందేహాలు వస్తే వాటిని నివృత్తి చేసేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు.పోలింగ్ లొకేషన్‌కు వీల్ చైర్లు చేరే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.. అదే విధంగా పోలింగ్ లొకేషన్ లలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.. పోలింగ్ జరిగే సమయంలో క్యూ లైన్‌లో ఉండే ప్రజలను ఎవరైనా భయభ్రాంతులకు గురి చేసినట్లయితే సంబంధిత వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి తీసుకొని వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల నుండి సైలెన్స్ పీరియడ్ మొదలవుతుందని, సైలెన్స్ పీరియడ్ మొదలైనప్పటి నుంచి ప్రోటోకాల్ ప్రకారం చేయాల్సిన పనులను చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజున పోలింగ్ సిబ్బందికి ఏ విధంగా అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేస్తున్నారనే వివరాలను కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు.

మూడవ విడత ర్యాండమైజేషన్ పూర్తి

పిఒ ఎపిఒ, ఒపిఒ, మైక్రో అబ్జర్వర్లకు సంబంధించిన మూడవ విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసి సంబంధిత నియోజకవర్గాలలోని పోలింగ్ కేంద్రాలకు కేటాయించామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లోని ఎన్ఐసి సమావేశ మందిరంలో జనరల్ అబ్జర్వర్ జాఫర్ పర్యవేక్షణలో పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లకు మూడవ విడత రాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించి పోలింగ్ కేంద్రాలకు కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే రెండవ విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసి పోలింగ్ సిబ్బందిని, మైక్రో అబ్జర్వర్లను నియోజకవర్గాలకు కేటాయించామన్నారు. ఈరోజు మూడవ విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసి నియోజకవర్గాలలోని పోలింగ్ కేంద్రాలకు కేటాయించామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ మధుసూదన్ రావు, జిల్లా ఖజానా శాఖ అధికారి రామచంద్ర రావు, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి, జిల్లా ఇన్‌ఫార్మాటిక్ అధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు..

ఈ గుర్తింపు పత్రాలు ఉంటే చాలు

సార్వత్రిక ఎన్నికలు 2024 లో భాగంగా పోలింగ్ రోజు ఎ పిక్ కార్డు లేని ఓటర్లు 13 రకాల గుర్తింపు పత్రాలు ఏవైనా ఉండవచ్చన్నారు. ఓటరు గుర్తింపు కార్డు , ఆధార్ కార్డు, జాబ్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, కార్మిక శాఖ వారి స్మార్ట్ కార్డు, పాస్పోర్ట్, ఫోటో కలిగిన పెన్షన్ డాక్యుమెంట్, సర్వీస్ ఐడి కార్డు, అధికారిక గుర్తింపు కార్డు, యూనిక్ డిసిబిలిటీ ఐడి పై తెలిపిన ఐడిలలో ఏదైనా ఒకటి చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు. ఓటర్ సమాచారం స్లిప్పులు , ఇఫిక్ పోలింగ్ స్టేషన్‌లో గుర్తింపు ప్రూఫ్ గా ఉపయోగించకూడదు. పోలింగ్ బూత్‌లోనికి సెల్ ఫోన్స్ ,ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబడవని కలెక్టర్ తెలిపారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ప్రమాదకరం : బిసిజనార్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రైతులకు ఎంతో ప్రమాదకరమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిసి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయం ముందు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జీవో నెంబర్ 512 కాపీలను తగలబెట్టి బిసి జనార్దన్ రెడ్డి, టిడిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిసి మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో మన పొలాలను జగన్ రెడ్డి లాక్కుని తాకట్టు పెడతారని తెలిపారు. ముఖ్యంగా టైటిల్ రిజిస్ట్రేషన్, ల్యాండ్ అపిలేట్ అథారిటీల నియామక సూత్రాలు, వివాదాల రిజిష్టర్ నిర్వహణ, యాజమాన్య హక్కుల వివాదాల పరిష్కారంలో సివిల్ కోర్టుల పాత్రను పూర్తిగా తొలగించారన్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఒరిజనల్ పత్రాలను యజమానులకు అందించకపోవడం, హైకోర్టులోనే అంతిమ పరిష్కారానికి చూపిన మార్గంతో సగటు రైతుకి దూరం కానున్న న్యాయం, కోర్టుకు వెళ్లాలన్నా సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలన్న నియమం వంటి ప్రధాన అంశాలకు సంబంధించి ఈ చట్టంలోని ప్రతిపాదనలు తరతరాలుగా కొనసాగుతూ వస్తున్న యజమానుల ప్రయోజనాలకు పూర్తిగా నష్టం కలిగించేలా ఉన్నాయని తెలిపారు. ఈ చట్టంలో ప్రతిపాదించిన వ్యవస్థాగత ఏర్పాట్లకు సంబంధించిన నియమాలు అధికార పార్టీ కనుసన్నల్లో నడుచుకునే అధికారులకు పూర్తి అధికారాలు సంక్రమింపచేసి, తద్వారా యాజమాన్య హక్కులను అతి సులువుగా అన్యాక్రాంతం చేసే విధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, టిడిపి మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు రాయలసీమ సలాం, నాయకులు పసుపల రమేష్, సుధాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ల్యాండ్ టైట్టింగ్ యాక్ట్ జిఒ ప్రతులను దహనం చేస్తున్న బిసి జనార్దన్‌రెడ్డి, ఆయన అనుచరులు